వీధి కుక్కలను పట్టి.. శస్త్ర చికిత్స చేసి

సాధారణంగా చిరాకుగా ఉన్నప్పుడు మనుషులు ఇతరులపై కోప్పడడం చూస్తుంటాం. మనుషుల మాదిరిగానే జంతువులకు చిరాకు కలిగినప్పుడు..అసౌకర్యంగా ఉన్నప్పుడు ఇతరులపై దాడి చేస్తూ ఉంటాయి. ఈ క్రమంలోనే పట్టణంలోని కుక్కలను పట్టి.. వాటికి ఆపరేషన్.. లేదా వ్యాక్సినేషన్ చేయించాలని పురపాలక శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఓ సంస్థలో టెండర్ కుదుర్చుకుంది.

- శస్త్ర చికిత్స కోసం రూ.23 లక్షల కేటాయింపు
- పట్టణంలో 3248 శునకాలు గుర్తింపు

ప్రొద్దుటూరు : పట్టణంలో ఇటీవల కుక్క కాటుతో ఆస్పత్రులకు చేరే వారి సంఖ్య కొంత పెరగడంతో ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక చర్యలకు ఉపక్రమించింది. పక్కా ప్రణాళికతో రూ.23 లక్షలు వ్యయం చేసేందుకు మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీ దేవి చేసిన తీర్మానానికి సభ్యుల ఆమోదం లభించింది. ప్రత్యేక నిబంధనల ప్రకారం మూగ జీవాలను చంపడానికి వీలులేదు. దీంతో



వీధిలో కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

పట్టణవాసులు కుక్క కాటుకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు వీధి కుక్కలను పట్టి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయనున్నారు. ఇందుకోసం కంపోస్టు యార్డులో ప్రత్యేక ఏర్పాట్లుచేశారు.

కుక్కల బెడద తొలగించేందుకు..



కుక్కలతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. దీంతో ప్రస్తుతం కాంట్రాక్టు ఏజెన్సీ ద్వారా కుక్కలను పట్టి ఆపరేషన్లు చేయిస్తున్నాం. పట్టుకున్న కుక్కలలో రోజూ 12 నుంచి 15 వాటికి ఆపరేషన్లు చేస్తున్నాం. ఆపరేషన్ తర్వాత ఆడ కుక్కలను నాలుగు రోజులు, మగ కుక్కలను రెండు రోజులు పరిశీలనలో ఉంచుకుని వదిలేస్తాం. ఇతర మున్సిపాలిటీల కుక్కలకు ఇక్కడే శస్త్ర చికిత్సలు చేస్తుండటంతో కొంత జాప్యం జరుగుతోంది.

– వి.మల్లికారున, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు

3248 కుక్కల గుర్తింపు

మున్సిపాలిటీ పరిధిలోని గోకుల్ నగర్, శ్రీరాముల పేట, హోమస్ పేట, శ్రీనివాసనగర్, ఆర్ట్స్ కాలేజీ రోడ్డు, రామేశ్వరం, మిట్టమడి వీధి, సంజీవనగర్ తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నారు. తరచూ కుక్కకాటుకు ప్రజలు గురై ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. దీంతో ఇటీవల డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో కుక్కల పాపులేషన్‌పై సర్వే జరిగింది. పట్టణంలో మున్సిపల్ శానిటరీ సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది రీసర్వే చేయగా మొత్తం 3,248 కుక్కలు వీధుల్లో సంచరిస్తున్నాయని గుర్తించారు. వాటిలో 1544 కుక్కలకు గతంలో శస్త్ర చికిత్సలు పూర్తి చేశారని, ప్రస్తుతం 1704 కుక్కలకు శస్త్ర చికిత్స చేయడానికి రూ.23 లక్షలు అవసరం అవుతుందని ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే కౌన్సిల్ ఆమోదం తెలుపడంతో ఈ మొత్తాన్ని సాధారణ నిధులనుంచి ఖర్చు చేస్తున్నారు. సహదేవ యానిమల్ వెల్ఫేర్ సొసైటీతో ఒక కుక్క శస్త్ర చికిత్స, వ్యాక్సినేషన్‌కు రూ.1347 చెల్లించేందుకు టెండర్ అనంతరం ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇతర ప్రాంతాల్లోని మున్సిపాలిటీల్లో పట్టుకున్న కుక్కలకు ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శస్త్ర చికిత్స చేస్తున్నారు.

న్యాక్ గ్రేడ్‌పై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ శామ్యూల్ డేవిడ్‌రాజ్ న్యాక్ గ్రేడ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ త్వరలో న్యాక్ పీర్ టీమ్ కళాశాలను సందర్శిస్తుందని తెలిపారు. కళాశాలలోని అన్ని విభాగాలకు చెందిన 5 సంవత్సరాల రికార్డులను సిద్ధం చేసుకోవాలని అధ్యాపకులకు సూచించారు. సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న కమలాపురం సీయస్‌యస్ఆర్ కళాశాల ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ వినయ్ మాట్లాడుతూ మంచి గ్రేడ్ సాధనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్ రావు, కో ఆర్డినేటర్ వెంకటరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు 25 మంది ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : సివిల్స్ ఉచిత శిక్షణకు 25 మంది మహిళలను ఎంపిక చేసినట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కొర్రపాడు రోడ్డులోని ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాలలో ఆదివారం సివిల్స్ ఉచిత శిక్షణకు రాత, మౌఖిక పరీక్ష జరిపారు. సంస్కృతి స్వచ్ఛంద సంస్థ, డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ సంయుక్తంగా ఎంపికైన వారికి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఎంపికైనవారు హైదరాబాద్ అశోక్ నగర్‌లోని డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీలో శిక్షణ పొందుతారని తెలిపారు. గ్రూప్–1, 2 పరీక్షల ప్రిలిమినరీకి ఎంపికైన పురుషులకు అర్హత పరీక్ష పెట్టి ఉచితంగా శిక్షణ



మాట్లాడుతున్న నంద్యాల కొండారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

అందిస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు 9949332920 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీవీ చూస్తూ కాలక్షేపం చేయడం దారుణం

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థిని పాము కాటుకు గురైతే.. సిబ్బంది టీవీ చూస్తూ కాలక్షేపం చేయడం దారుణమని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి నాగరాజు అన్నారు. విలేకరులతో వారు మాట్లాడుతూ ఆదివారం రాత్రి పాము కరిస్తే సోమవారం ఉదయం వారిని ఆస్పత్రికి తీసుకురావడం ప్రిన్సిపల్ నిర్లక్షానికి నిదర్శనం అన్నారు. పాము కరచిందని చెప్పినా ఉపాధ్యాయులు పట్టించు కోకుండా ఎలుక కరిచిందంటూ నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంపై శిక్షణ

బి.కోడూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నెహ్రూ జయంతి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రిచే ప్రారంభమవుతున్న రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంపై ఎంపీహెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 నెలలు నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలకు అంగన్వాడీ స్కూల్‌లో, 6 సంవత్సరాల నుండి 10 సంవత్సరాల లోపు పిల్లలకు ఎంపీపీ స్కూళ్లలో, అలాగే 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు జెడ్పీ హైస్కూల్‌లలో చదివే విద్యార్థినీ విద్యార్థులకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు ఆర్‌బీఎస్‌కే పుస్తకాలు అందజేశామని తెలిపారు. అంగన్వాడీ స్కూళ్లలో



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి

పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి నమోదు చేయాలని ఎంపీహెచ్‌పీలు, ఏఎన్ఎంలకు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగలక్ష్మి, సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి, సూపర్‌వైజర్ జాన్‌విలియం, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఎంపీహెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సులభతర ప్రసవానికి చర్యలు చేపట్టాలి

చాపాడు : ప్రమాద స్థాయి గర్భవతులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని మండల వైద్యాధికారులు శ్రీవాణి, కావ్య మాధురి పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ప్రమాదస్థాయి గర్భిణులను గుర్తించి వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని వారు సులభతరంగా ప్రసవం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. నవజాత శిశువు సంరక్షణపై దృష్టి పెట్టాలని, పెరుగుదల, అభివృద్ధి మైలురాళ్లను ట్రాక్ చేయడం, పెరుగుదల ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. ప్రతి నెలా 9న జరిగే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి గర్భవతులు తీసుకువచ్చి వైద్యపరీక్షలు చేయించాలన్నారు. ప్రభుత్వ ఆసు



మాట్లాడుతున్న వైద్యాధికారులు శ్రీవాణి, కావ్య మాధురి

పత్రులలో కాన్పులు కావడమే శ్రేయస్కరమని ప్రజలు వివరించాలన్నారు. ఇదే క్రమంలో చైల్డ్ ఫండ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ వారు హెచ్ఐవీ, ఎయిడ్స్‌ను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, సూపర్‌వైజర్లు సరస్వతీ, బాబురెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుకు కృషి

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులో నిర్మిస్తున్న ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో నూతన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామని మాలమహానేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాలమహానేన ఆధ్వర్యంలో ప్రజా సంఘాలను కలుపుకుని ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను కోరతామని తెలిపారు.

జిల్లాలో విజిలెన్స్ దాడులు



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

కడప అర్బన్: విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి భారీ స్థాయిలో బియ్యం స్వాధీనం చేసుకున్నారు. కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ నెల 4న చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరు సర్కిల్‌లో దాడులు జరిపారు. లారీలో తరలించేందుకు సిద్ధంగా ఉంచిన అందులో 600 బస్తాలు 29910 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.25,60,905లు ఉంటుందని అధికారులు తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లి పట్టణంలో కొండపేటకు చెందిన ముత్తుకూరు శ్రీనివాసులు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి బియ్యం సేకరించి పోర్టుకు రవాణా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో బనగానపల్లికి చెందిన వి.దేగేశ్వరరెడ్డి, జి.మద్దిలేటిలను పట్టుకుని చింతకొమ్మదిన్నె పోలీసులకు అప్పగించారు. పులివెందుల సీఎస్‌డీటీ అధికారులతో కలిసి సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరు గ్రామంలోని షెడ్డులో 105 బస్తాల 3469 కిలోల రేషన్ బియ్యం పట్టుకున్నారు. వీటి విలువ రూ. 1,57,839 ఉంటుందని అధికారులు తెలిపారు. తుమ్మల మిత్రమ నాయుడును పట్టుకుని సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ తనిఖీలలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అడుసువారిపల్లెలో 'పొలం పిలుస్తోంది'

గోపవరం : మండలంలోని అడుసువారిపల్లెలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా రైతులు సాగు చేసిన పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం రబీలో క్రాసింగ్ పంటలైన సజ్జ, మొక్కజొన్న పంటలు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారని, ఇందుకోసం విత్తనాలు ఇచ్చే పలు కంపెనీలు రైతుల చుట్టూ తిరుగుతున్నారని, అయితే వారు చెప్పిన మాటలను నమ్మి రైతులు మోసపోవద్దని, ఏదైనా విత్తనాలు తీసుకున్నప్పుడు వారి నుండి అంగీకార పత్రం తీసుకున్న తర్వాతనే విత్తనాలను సాగు చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం బ్రాహ్మణపల్లె రైతుభరోసా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు

చేసి రిజిస్టర్లను పరిశీలించారు. ప్రస్తుత సీజల్‌లో డీఏపీ, పొటాష్, యూరియా అందుబాటులో ఉంచాలని బ్రాహ్మణపల్లె, అడుసువారిపల్లె రైతులు వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది బాదుల్లా, సుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.

శిథిల భవనాలు తొలగించుకునేలా అవగాహన కల్పించండి

బద్వేలు అర్బన్ : పట్టణంలో శిథిలావస్థకు చేరిన భవనాలను సంబంధిత యజమానులే స్వయంగా తొలగించుకునేలా వారికి అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం త్యాగరాజకాలనీలో కమిషనర్ సూచనల మేరకు శిథిలావస్థకు చేరిన రెండు భవనాలను సంబంధిత యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన భవనాలను అలాగే వదిలేస్తే వర్షాలు పడిన సమయంలో కూలిపోయే ప్రమాదముందని, దీనిని దృష్టిలో ఉంచుకుని సంబంధిత యజమానులు శిథిల భవనాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. అలాగే మున్సిపల్, సచివాలయ సిబ్బంది ప్రతిరోజూ వార్డుల్లో పర్యటిస్తూ శిథిల భవనాలను గుర్తించాలని కోరారు. అలాగే ఖాళీ జాగాల్లో పెరిగిన



సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

కంపచెట్లను, పిచ్చిమొక్కలను సంబంధిత యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. అలాగే తాగునీరు వృథా చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆకు ముడత' నివారణకు చర్యలు తీసుకోవాలి

చాపాడు : వరి పైర్లలో ప్రస్తుతం ఆకుముడత పురుగు ఆశిస్తోందని దీని నివారణ కోసం రైతులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏడీఏ కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని చియ్యపాడు, సిద్దారెడ్డిపల్లె గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయాధికారి మ్యాగీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ వరి పైర్లలో రైతులు ఆకు ముడత నివారణ కోసం ఫ్లుబెండమైడ్ 0.25 మి.లీ లేదా క్లోరాంట్రానెలిపోల్ 0.3 మి.లీ, 19:19:19 10గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇలా చేయడం ద్వారా ఆకుముడత పురుగు చచ్చిపోతుందన్నారు. గ్రామ



చియ్యపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు, రైతులు

సచివాలయాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల సేవలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ రాము పాల్గొన్నారు.

ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మైదుకూరు : రైతులు ఉద్యాన శాఖ అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి పి.లక్ష్మీప్రసన్న తెలిపారు. మంగళవారం మండలంలోని విశ్వనాథపురం, జంగంపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మినుము పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీవిద్యారాణి, ఫిరోజ్ హుస్సేన్ మాట్లాడుతూ జీవన ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. పసుపు, అరటి పంటల్లో వచ్చే తెగుళ్ల నివారణ



పసుపు పంట వద్ద వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు

గురించి తెలిపారు. అనంతరం వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు మిరప, పసుపు పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు తెలిపారు.

సచివాలయ ఉద్యోగ సమస్యలపై మంత్రికి వినతి

పోరుమామిళ్ల : సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ సమస్యలపై మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితకు వినతిపత్రం ఇచ్చినట్లు గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగ సమాఖ్య రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సిద్దేశ్వరరెడ్డి తెలిపారు. సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు ఉద్యోగంలో చేరి 5 సంవత్సరాలు గడిచినా ప్రమోషన్ చానల్ ఏర్పాటు కాలేదన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల్లో, విద్యాశాఖలో ప్రమోషన్ ఇవ్వాలని వినతిపత్రం ఇచ్చామన్నారు. జాబ్‌చార్ట్, మదర్ డిపార్ట్‌మెంట్‌లో మెర్జ్ చేయడం గురించి మంత్రికి వివరించామన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని సిద్దేశ్వరరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చిన్న మస్తాన్, మైసూరారెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, రవికుమార్, విజయకుమార్, నాగరాజు, నరసింహారెడ్డి పాల్గొన్నారన్నారు.

ఘనంగా ఆరాధనా ఉత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నామా ఎరుకలయ్య, కమలాక్షమ్మ ఆరాధనా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం వేణుగోపాలస్వామికి, మళయాలస్వామికి, ఎరుకలయ్య, కమలాక్షుమ్మ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. గణపతిపూజ, కలశారాధన, భగవద్గీతా పారాయణం, తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తి గీతాలకు రాజుపాళెం మండలానికి చెందిన మహిళల కోలాటం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఈఓ రామచంద్రాచార్యులు, శారదా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సురేష్‌బాబు రెడ్డి, విజయ్, జనార్ధనరెడ్డి, ఆశ్రమంలోని విద్యాసంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న మహిళలు

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

పులివెందుల రూరల్ : రైతులందరూ ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించి ప్రోత్సహించాలని మండల వ్యవసాయాధికారిణి నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం ఇ.కొత్తపల్లె గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి అరటి పొలంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రైతులు, అధికారులతో కలిసి అరటి పంటను పరిశీలించి రసం పీలే పురుగులు, గుడ్ల నివారణ కోసం ప్రకృతి వ్యవసాయ పద్ధతి పాటించాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ మాస్టర్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని రైతులందరూ అనుసరించి పెట్టుబడి తగ్గించుకుని మంచి ఆహారాన్ని తినాలన్నారు.

వాతావరణ మార్పులతో జీవుల మనుగడకు ప్రమాదం

మైదుకూరు : వాతావరణ మార్పులతో కొన్ని రకాల జీవ జాతుల మనుగడకే ప్రమాదం పొంచి ఉందని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వి.సలీంబాషా అన్నారు. కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వాతావరణ మార్పు అంశంపై విద్యార్థులకు మంగళ వారం అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు జరిగితే విధ్వంసక తుఫాన్లు, ఉష్ణోగ్రత పెరగడం వంటి పరిణామం జరుగుతుందన్నారు. తేమ ఆవిరై తీవ్ర వర్షపాతం లేదా వరదలకు దారితీస్తుందన్నారు. వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వేసవి, తీవ్ర వేసవికాలం మాత్రమే కనిపిస్తున్నాయన్నారు. డాక్టర్ వి. రమేష్ వాతావరణ మార్పులతో కలిగే నష్టాలను, వాటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నాగరత్నమ్మ, అనూరాధ, శాలెం, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తులకు అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న ముండ్ల నవనీశ్వర్ రెడ్డి దంపతులు

ఖాజీపేట : కార్తిక మాసంలో పరమ శివుడిని పూజించేందుకు భక్తులు బారులు తీరుతున్నారు. ఖాజీపేట మండలం పుల్లూరు సమీపంలోని నాగనాథీశ్వరుడిని ఎంఆర్ఎఫ్ అధినేత ముండ్ల నవనీశ్వర్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయం దిగువన వారితోపాటు ముండ్ల శివప్రసాద్‌రెడ్డి కలిసి స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. నవనీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా కార్తిక మాసంలో తొలి సోమవారం రోజున అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాలానుగుణంగా పంటలు సాగు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

అట్లూరు : కాలానుగుణంగా రైతులు పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి జి.రామకృష్ణయ్య పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని మణ్యవారిపల్లి గ్రామంలో మంగళవారం రైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడి సాధించాలని పేర్కొన్నారు. అలాగే పకృతి సేద్యం వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు. అనంతరం ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంటలో చీడపీడల నివారణపై వివరించారు.

ముంపు గ్రామాన్ని పరిశీలించిన అధికారులు



చింతువాండ్లపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

అట్లూరు : సోమశిల వెనుక జలాలతో ముంపునకు గురి కానున్న చింతువాండ్లపల్లి గ్రామ పరిసరాలను మంగళవారం సోమశిల ఎస్ఈ బి.వి. రమణారెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. గత కొన్నేళ్లుగా గ్రామస్తులు పడుతున్న అవస్థలపై అధికారులకు వివరించారు. అలాగే నష్ట పరిహారం గురించి గ్రామస్తులు అడుగగా మీరంతా ఒక నిర్ణయానికి వచ్చి ప్రజా ప్రతినిధులతో ప్రభుత్వం దృష్టికి తీసకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఎంవీ రమణారెడ్డి, డీఈ. శ్రీనివాసకుమార్, ఏఈలు శివప్రసాద్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కొండయ్య స్వామి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కొండయ్య స్వామి

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాయిపల్లె గ్రామంలో మంగళవారం అవధూత కొండయ్య స్వామి జన్మదిన వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం భక్తుల సమక్షంలో తన 43వ జన్మదినం సందర్భంగా కొండయ్య స్వామి భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం దానిని స్వామి శిష్యులు, భక్తులకు పంచి పెట్టారు. మంగళవారం మధ్యాహ్నం ప్రభ కార్యక్రమాలు జరిగాయి. రాత్రి ఆర్కెస్ట్రా, జబర్దస్త్ కార్యక్రమాలను నిర్వహించారు. బుధ, గురువారాల్లో బండలాగుడు పోటీలు, మనుషులు గుండు ఎత్తే పందెం, పరుగు పందెం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి సవితకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజాంజనేయులు

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్(ఎస్‌టిఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. జిల్లా డీఆర్‌సీ సమావేశానికి హాజరైన జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి సవితను ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ 35 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. అలాగే సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలుచేయాలని, జెడ్పీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. అరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు.